


(గత సంచిక తరువాయి)

**స్క్రీన్ మీద పెద్దగా వస్తున్న** బీప్ శబ్దానికి గతం నుండి తేరుకున్నాడు భద్రా.,

స్క్రీన్ వంక చూస్తూ, “దొరికావు విధాతా..! ఈసారి నా చేతినుండి నువ్వు తప్పించుకోలేవు” అంటూ పాడ్‌ను పంపడానికి అన్నింటిని సిద్ధం చేయడం ఆరంభించాడు.

☆☆☆☆☆

వశిష్ఠ ఇచ్చిన ఆఫర్‌ను మనసులో పెట్టుకుని అతను పంపిన త్రీడీ డిజైన్స్ పూర్తిగా స్టడీ చేసి వాటినుండి వెలువడే ఫ్రీక్వెన్సీని కనిపెట్టాడు వంశీ. వచ్చిన ఫ్రీక్వెన్సీ రిజల్ట్స్ చూసి ఆశ్చర్యపోయిన అతను  వెంటనే విరించికి కాల్ చేశాడు. విరించి ఫోన్ నేరుగా వశిష్ఠకు ఇచ్చాడు.

వశిష్ఠ, “చెప్పు వంశీ!! ఏమైంది?” అనడిగాడు.

వశిష్ఠ పక్కనే ద్రోణా కూడా నిలబడ్డాడు.

వంశీ తాను చేసిన వర్కౌట్ చూపిస్తూ, “సర్!! ఇలాంటి ఫ్రీక్వెన్సీని నేను ఎన్నడూ చూడలేదు. ఇది కచ్చితంగా మన భూమ్మీద జనరేట్ అయ్యే ఫ్రీక్వెన్సీ ఐతే కాదు. నేను నాసా, ఇస్రోల నుండి వచ్చే కొన్ని సీక్రెట్ ఫ్రీక్వెన్సీలు కూడా క్రాక్ చేశాను, ఇవే కాదు లోకల్‌గా వుండే అనేక సెక్యూర్ ఫ్రీక్వెన్సీలు కూడా క్రాక్ చేశాను. అంతెందుకు సర్.., ఒకసారి మీవి కూడా.....” అని మాట దాటేసి, “మీరేమైనా ఏలియన్స్ లేదా వింత జీవులతో కమ్యూనికేట్ అవుతున్నారా!?” అనడిగాడు.

వెనుకున్న విరించి, “రేయ్ వంశీ!! ముందేదో అంటూ ఆపేశావు ఏంటదీ?” అని అడిగి చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వడం ఆరంభించాడు.

ద్రోణా గుర్రుగా చూడడంతో, విరించి పక్కకు వెళ్ళిపోయాడు.

వశిష్ఠ, “అవును వంశీ అలాంటిదే..!! నువ్వు దాన్ని కనిపెట్టావా?” అనడిగాడు.

“యస్ సర్!! కనిపెట్టాను., మీ దగ్గర ఉన్న డివైజ్ కాన్ఫిగరేషన్స్ చెబితే దానికి తగ్గట్టుగా నేను కోడింగ్ రాసి పంపుతాను....”

“ఓహ్,, వెరీ గుడ్!! ఇప్పుడే పంపిస్తాను., ఒకవేళ మనం అందరం బ్రతికి ఉంటే తప్పకుండా నువ్వు నాతో కలసి పనిచేయొచ్చు”

వంశీకి అర్థం కాక, “ఏమన్నారు సర్!! బ్రతికి ఉంటేనా..!?” అనడిగాడు.

వశిష్ఠ, “టేక్ కేర్!!” అని కాల్ కట్ చేసి వంశీ అడిగిన అన్ని వివరాలు పంపాడు.

అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న ఆర్యా, “సర్!! సర్!!” అని గట్టిగా అరిచాడు.

అందరి దృష్టి ఆర్యా వైపు మళ్లింది.

భీష్మ, “ఏమైంది ఆర్యా!?” అనడిగాడు.

ఆర్యా, “ఒకసారి టీవీ ఆన్ చేయండి....” అన్నాడు.

విరించి లేచి టీవీ ఆన్ చేసి న్యూస్ ఛానల్ పెట్టాడు.

అందరూ కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు.

టీవీలో, 'మారిపోతున్న భూ కాలమానం., వింత వింత సంఘటనలు ఎదురవుతున్నాయంటూ నెటిజన్లు పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి. ఐతే అవి ఫేక్ అని చాలామంది కొట్టిపడేశారు.

ఐతే!! డాక్టర్ జాన్ అనే క్వాంటమ్ సైంటిస్ట్ ప్రకారం అవన్నీ నిజం. భూమ్మీద మరికొన్ని రోజుల్లో లేదా మరికొన్ని క్షణాల్లో లేదా మరికొన్ని వందల సంవత్సరాల తర్వాతనో నాన్ లీనియర్ టైం జోన్స్ రాబోతున్నాయి. మరలా భూమి మీద జీవం ఆవిర్భవించే సమయం రాబోతుంది లేదా మనతో పాటు డైనోసార్లు జీవించబోతున్నాయి. ఏదైనా జరగచ్చు అన్నారు. ప్రస్తుతం మీరు చూస్తున్న ఈ ప్రదేశం పేరు మడగాస్కర్ ఇక్కడ సుమారు రెండు మూడు కిలోమీటర్ల వరకూ కాలమానంలో మార్పు వచ్చింది. ఈ రెండు కిలోమీటర్లు వెయ్యి సంవత్సరాల వెనక్కి వెళ్లాయి. దీనిని కనిపెట్టింది కూడా డాక్టర్ జాన్‌నే, ఇక్కడ పెరుగుతున్న మొక్కలను పరిశీలించిన ఆయన అనుమానం వచ్చి వాటిని టెస్ట్ చేయించారు. వాటిని అధ్యయనం చేసిన వృక్ష శాస్త్రవేత్తలు అబ్బురపడే విషయాలు చెప్పారు. ఈ మొక్కలు సుమారు వందల ఏళ్ళ క్రితం నాటివని చెప్పారు. అలాగే అక్కడకు వెళ్లిన జాన్ తన వాచ్ జిపియస్ క్లాక్‌ల మధ్య సమయం చూసే సమయంలో అవి అపసవ్య దిశలో తిరుగుతున్నాయని గమనించాడు. మరింత అనుమానం పెరిగి కార్బన్ డేటింగ్‌తో సారూప్యత ఉన్న అనేక ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగించి అక్కడికి మొక్కలను, అక్కడి వాతావరణం అధ్యయనం చేశాడు. చివరికి అక్కడ ఓ కొత్త కాలమానం స్టార్ట్ అయ్యిందని నిర్ధారణ చేసుకున్నాడు. వాటి గురించి వివిధ దేశాలకు రిపోర్ట్ చేసి తమతమ దేశాల్లో అలాంటి వాటిని గుర్తించాలని కోరాడు. కానీ జాన్ ప్రతిపాదనలను ఒక్కదేశం కూడా గుర్తించడం లేదు. ఇక్కడే ఆయా దేశాలు తప్పు చేస్తున్నాయని ఈ ప్రమాదాన్ని అడ్డుకోవడానికి పరిష్కారాలు వెతకాలని లేదంటే ఈతరం

యొక్క మానవాళి ఉనికి లేకుండా పోతుందన్నాడు. అలాగే చాలామంది ప్రజలు తమతమ కళ్ళముందు కొన్నిసార్లు రాజులను, విచిత్ర జీవులను, అంతరిక్ష నౌకలను చూస్తున్నామని అవి అలా ఒక రెండు మూడు నిమిషాలు వచ్చి పోతున్నాయని రిపోర్ట్ చేశారు. వీటిమీద ఇప్పటివరకూ ఏ దేశం కూడా స్పష్టమైనా వివరణ ఇవ్వలేదు. ఐతే ఇలాంటి సంఘటనలు భారతదేశంలో కూడా జరిగినట్టు కొన్ని వీడియోలు హల్ చల్ చేశాయి. కానీ, వాటిని కేంద్రప్రభుత్వం కొట్టి పారేసింది. అసలు భూమి కాలమానంలో వస్తున్న ఆ మార్పులు ఏంటి? మనం చిన్నప్పటి నుండి విన్న యుగాంతం ఇదేనా? తెలుసుకోవాలంటే చూస్తుంటేనే ఉండండి.......” అని ప్రసారం చేశారు.

కొన్నిక్షణాలు అందరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

విరించి, “సర్!! ఇవన్నీ చేసేదానికంటే, స్పేస్‌లో వాళ్ళ షిప్ ఎక్కడుందో కనిపెట్టి దాని మీదకు ఓ మిస్సైల్ వదిలితే సరిపోతుంది కదా? ఆ భద్రాగాడు పోతాడు, ఈ అగస్త్యగాడు భూమ్మీదనే అడుక్కుతింటాడు. దీనికి ఇంతలా ఆలోచించడం ఎందుకు?” అని అనేసి పెద్ద వేదాంతిలా అందరి వంక చూసాడు.

వశిష్ఠకు నవ్వొచ్చి, “అంటే!! మాకెవరికి ఆ ఆలోచన రాలేదని నువ్వు అనుకుంటున్నావా? ఆ షిప్ వచ్చి దాదాపు నెలరోజులు అయ్యింది. ఇప్పటివరకూ ఒక్కదేశం కూడా దానిని గుర్తించలేకపోయింది. మనం ఒక్క చిన్న సిగ్నల్ ఫ్రీక్వెన్సీని కనిపెట్టడం కోసం తన్నుకులాడుతున్నాము. నువ్వేమో స్పేస్ షిప్ మీద రాకెట్ ప్రయోగం చేయమంటున్నావు. ఇది అసాధ్యం, మొదట నేను కూడా నీలానే ఆలోచించాను. ఆ షిప్‌ను కనిపెట్టే సమయంలో ఒక శాతం అగస్త్యను కనిపెట్టడానికి వాడి, వాడి ద్వారానే ఆ షిప్ లోకేషన్ కనిపెట్టాలనేదే నా ప్లాన్. భూమ్మీద ఉన్న అగస్త్య కోసం వాడు సెక్యూర్‌గా ఉన్న షిప్ నుండి అన్ ప్రొటెక్టెడ్ ఫ్రీక్వెన్సీను బయటకు పంపుతాడు. దాన్ని మనం ట్రేస్ చేయాలి. అప్పుడే మనకు అగస్త్య, వాడి వెనుక షిప్, భద్రా అందరూ దొరుకుతారు” అని సమాధానం చెప్పి, “భీష్మ, ద్రోణా మీ ఇద్దరూ నాతో రండి, విరించి నువ్వు ఇక్కడే ఉండు. ఆర్యాను జాగ్రత్తగా చూసుకో...” అని అక్కడ నుండి ల్యాబ్ లోకి వెళ్ళాడు. వెనుకనే భీష్మ, ద్రోణా వెళ్లారు.

ఆర్యాతో, “సర్!! వశిష్ఠ సర్ నన్ను కావాలనే లోపలకు రమ్మనలేదు కదా..!?” అనడిగాడు విరించి.

ఆర్యా, “అదేదో సైన్స్‌కు రిలేట్, మనకి దాంతో సంబంధం లేదు కదా? అందుకే మనల్ని ఇక్కడ ఉన్నామన్నాడు. నువ్వు ఫీల్ కాకు....” అన్నాడు.

విరించి, “సర్!! మీకు ఆల్రెడీ చెప్పాను, నేను కూడా సైన్స్ స్టూడెంటునే....” అని ఆర్యా పక్కన కూర్చుని టీవీలో ఛానల్స్ మార్చడం ఆరంభించాడు.

అక్కడ అగస్త్య, భద్రా ఎప్పుడు పాడ్ పంపుతాడోనని ఎదురుచూడటం ఆరంభించాడు.

ఇక్కడ భద్రా, అగస్త్య ఎప్పుడు షిప్ లోకి వస్తాడా, చెల్లెలి చావు వెనుక కారణం ఏమిటో తెలుసుకోవడానికి ఆతృతగా వున్నాడు. అదే సమయంలో అగస్త్యను చంపేంత కోపంతో వున్నాడు.

వీళ్ళు ఇలా ఉంటే మెల్లిమెల్లిగా భూమ్మీద నాన్ లీనియర్ జోన్స్ ప్రభావం మొదలై, తీవ్రరూపం దాల్చడానికి సిద్ధంగా ఉంది.

ఆర్యా, విరించి టీవీ దగ్గరే వున్నారు. వశిష్ఠ వెనకాలే వెళ్లిన భీష్మ, ద్రోణాలు లోపల ఉన్న సీక్రెట్ ల్యాబ్ చూసి నివ్వెరపోయారు. లోపల అన్నీ కూడా అధునాతన టెక్నాలజీతో నిండిన పరికరాలు, కంప్యూటర్లు ఉన్నాయి.

ద్రోణా, “నిన్ను చాలా తక్కువ అంచనా వేశాడు మా అగస్త్య....” అన్నాడు.

వశిష్ఠ, “అగస్త్యలాంటి వాళ్ళను పట్టుకోవాలంటే ఆ మాత్రం అంచనాలు మించాలి కదా?” అని ఫోన్ బయటకు తీశాడు.

సరిగ్గా అదే సమయానికి వంశీ నుండి మెసేజ్ వచ్చింది. అది తాను రాసిన కోడింగ్ డాక్యుమెంట్.  వంశీ తన దగ్గరున్న సిస్టంలో ఆ కోడింగ్‌ను ఎక్జిక్యూట్ చేయడం ఆరంభించాడు.

భీష్మ, “ద్రోణా!! నీ గతం మొత్తం విన్నాను. నువ్వు మా భూమిని కాపాడటానికి సహాయం చేస్తున్నందుకు చాలా థాంక్స్., నాకొక విషయం ఆసక్తిగా ఉంది. నువ్వు హ్యాపీగా సమాధానం చెబుతానంటే అడుగుతాను” అన్నాడు.

ద్రోణా, “మీ గ్రహానికి, మా గ్రహానికి ఉన్న తేడా ఏంటనే కదా?” అనడిగాడు.

భీష్మ  మరింత ఉత్సాహంతో, “యస్!! అదే....అదే!!” అన్నాడు.

“మీ గ్రహానికి వచ్చినప్పుడు నాక్కూడా ఇలాంటి ఆసక్తి ఉండేది..”

కళ్ళల్లో ఆశ్చర్యం కురిపిస్తూ, “అవునా!!?” అన్నాడు భీష్మ.

“ఎందుకు అంతగా ఆశ్చర్యపోతున్నారు? నేను కూడా మీలా మనిషినే., మీరెలా ఇక్కడ జీవనపోరాటం చేస్తున్నారో మేము కూడా అక్కడ చేస్తాము. కాకపోతే మీకంటే కాలమానంలో కొన్ని వందల ఏళ్ళు ముందున్నాము. మీరు వెనుక వున్నారు. దీనిలో ఆశ్చర్యపోవడానికి ఏమీ లేదు. ఇప్పుడు ఈ టైంలో నేను మీ ముందు ఉన్నాను కాబట్టి మీకింత ఆశ్చర్యం.., ఒకవేళ నేనుగానీ లేదా మా గ్రహం నుండి వేరే ఎవరైనా మరికొన్ని వందల ఏళ్ల తర్వాత వస్తే మీకింత ఆశ్చర్యం అనిపించదు. కారణం, అప్పుడు మీరు కూడా ఈ సమాంతర విశ్వాలలో మీరు ఒంటరి కాదని మీకు తెలుస్తుంది. మీ సాంకేతికత అభివృద్ధి చెందుతుంది. కోట్లలో ఒక వశిష్ఠ తయారైతే అప్పుడు వందలో ఒక వశిష్ఠ పుట్టుకొస్తాడు. ఇక్కడ మనం చేయవలసిన పనేమీ లేదు. కాలంలో వచ్చే మార్పులను గమనించుకుంటూ పోవడమే. కాకపోతే మన ఆయుష్షు

పరిమితం కాబట్టి మనం కొన్ని కొన్ని సంఘటనలకు మాత్రమే సాక్షులుగా ఉంటాము. మీరే ఇన్ని చూస్తున్నారంటే మీ ముందు తరం వాళ్ళు ఎన్ని చూడాలి? ఎన్ని ప్రమాదాలు ఎదుర్కోవాలి? ఆలోచించండి?"

భీష్మ, "అంటే మీకూ మాకూ పెద్ద వ్యత్యాసం లేదన్నమాట" అన్నాడు.

"ఒక చిన్న వ్యత్యాసం ఉంది. అదే దీనికంతటికీ కారణం...."

"ఏంటి ద్రోణా అది?" మరింత ఆసక్తిగా అడిగాడు భీష్మా.

"అదే ఔట్ కం ఆఫ్ యాన్ ఈవెంట్, దీన్ని బేస్ చేసుకునే మీలో జరిగే పరిణామాలు మమ్మల్ని ప్రభావితం చేస్తాయి, మాలో జరిగే పరిణామాలు మిమ్మల్ని ప్రభావితం చేస్తాయి. మేము కుడికి పోతే, మీరు ఎడమకు పోతారు. మేము ఇక్కడ టైం మెషీన్ కనిపెట్టాము, మీరు ఇక్కడ టైం ఎనలైజర్ కనిపెట్టారు. అంటే., ఒక పని జరిగినప్పుడు కచ్చితంగా రెండు ఫలితాలు వచ్చే అవకాశం వుంటుంది. ఆ పని సక్సెస్ అవచ్చు లేదా ఫెయిల్యూర్ కావచ్చు. మా దగ్గర సక్సెస్ అయితే మీ దగ్గర ఫెయిల్యూర్ అవుతుంది. ఇదంతా సామాజికంగా ఉండొచ్చు లేదా వ్యక్తిగతంగా కూడా ఉండవచ్చు. కాలంలో ఏ మార్పు ఎప్పుడు ఎలా వస్తుందో పూర్తిస్థాయిలో అంచనా వేసే స్థాయికి మనం ఇంకా ఎదగలేదు. మీరింకా అదృష్టవంతులు ఇక్కడ వశిష్ఠ వున్నాడు. టైం ప్యాటర్న్ ఎనలైజర్ మీ దగ్గర ఉంది. మీకు కొంచెం అవకాశం ఉంది. మేము మాట్లాడే భాష, మా యాస, సాంస్కృతి అన్నీ ఒకేలా ఉంటాయి. మీరు పూజించినట్టే మేము కూడా దేవుడిని పూజిస్తాము. అంతెందుకు నా పేరు ద్రోణా., ఆ ద్రోణాచార్యుడి పేరు మీదగా అమ్మానాన్నలు పెట్టిన పేరు. ఒకరి విషయంలో మరొకరు వేలు పెట్టనంత వరకూ అన్ని గ్రహాలలో శాంతి ఉంటుంది లేదా ఇలా అల్లకల్లోలం అవుతుంది"

భీష్మ, "అయితే మీరూ మేము ఒకటేనన్నమాట., సూపర్!!" అన్నాడు.

ఈలోగా వశిష్ఠ, "ఇద్దరూ ఇటు రండి, అగస్త్యను పట్టుకోవడానికి సెటప్ అంతా సిద్ధం. భద్రా పాడ్ పంపించడమే ఆలస్యం" అన్నాడు.

ద్రోణా ఆలోచిస్తూ, "ఈలోపు అగస్త్య కాలంలో ముందుకీ వెనక్కీ వెళ్లకుండా ఉంటే మంచిది., అతని లొకేషన్ మారిన తర్వాత పాడ్ వచ్చినా ఉపయోగం ఉండదు" అన్నాడు.

"యస్!! అగస్త్య అంత మూర్ఖుడు కాదు, వాడు ఖచ్చితంగా మరోసారి కాలం చేతిలో ఓడిపోవడానికి సిద్ధంగా లేడు. అతనికి ఆ సందర్భం నుండి ఎలా తప్పించుకోవాలో బాగా తెలుసు. ఈసారి వాడు టైమ్ ట్రావెల్ చేస్తే వాడికే నష్టం. ఏ కాలంలో ఎప్పుడు ఎక్కడకు వెళ్తాడో మనకు తెలియదు, అలాగే వాడికి తెలియదు. వాడు ఆ లూప్ నుండి బయటకు రావాలంటే ఈసారి ఖచ్చితంగా స్పేస్‌షిప్‌ను వాడు చేరుకుని తీరాలి. మనకు కూడా ఇదే చివరి అవకాశం" అన్నాడు వశిష్ఠ.

భీష్మకు అనుమానం వచ్చి, “అగస్త్య టైమ్ ట్రావెల్‌లో ఇరుక్కుంటేనే మనకు మంచిది కదా? వాడు భూమ్మీద ఏదో కాలమానంలోకి నెట్టివేయబడతాడు. అప్పుడు మనం ఈ ప్రస్తుత కాలమానంలో హాయిగా ఉండొచ్చు కదా?” అనడిగాడు.

అప్పుడు ద్రోణా, “మిస్టర్ భీష్మా!! మీకసలు విషయం చెప్పడం మరిచాను. ఆ అగస్త్యను మీరు తక్కువ అంచనా వేశారు. అగస్త్య భూమ్మీదకు ఒంటరిగా రాలేదు. తనతో పాటు టైమ్ క్యాప్సూల్స్ తీసుకొచ్చాడు. వాటి సంఖ్య వందల్లో వుంది. అవి మీ గ్రహం మొత్తం విస్తరించి ఉన్నాయి. అవి రోజుకు కొన్ని వందలసార్లు కాలప్రయాణం చేస్తున్నాయి. వాటిని ఆపాలంటే అగస్త్య డి.ఎన్.ఏ సిగ్నేచర్ కావాలి. మెయిన్ కంట్రోల్ ప్యానెల్ ల్యాబ్ లోనే ఉంది. అక్కడే అసలైన మదర్ టైం మెషీన్ ఉంది. దాన్ని చేరుకుని షట్ డౌన్ చేయడమే మన కర్తవ్యం” అని చెప్పాడు.

ద్రోణా మాటల్లో లోతు అర్థమైన భీష్మ, “వీడు నిజంగా సామాన్యుడు కాదు...” అన్నాడు.

వశిష్ఠ, “అందుకే కదా!? వాడ్ని పట్టుకోవడానికి ఇన్ని తంటాలు పడుతున్నాము. ఇంకోటి, మనం ఆ స్పేస్ షిప్‌ను గుర్తించినా దానిమీద మిస్సైల్ ప్రయోగించలేము. ఒక్కసారి మెషీన్ బ్లాస్ట్ అయితే ఆ వంద క్యాప్సూల్స్ పరిస్థితి ఏంటి? వాటివల్ల వచ్చే ప్రమాదం ఏంటి? అనే విషయాలు మనకు తెలియవు. ఒకడు తెలియక చేసిన తప్పుకు మనం ఇన్ని అనుభవిస్తున్నాము. మనమెందుకని తెలిసి మరీ తప్పు చేయాలి” అనడిగాడు.

“యస్ వశిష్ఠా!! యువార్ కరెక్ట్., కానీ ఇప్పుడు ఆ సిగ్నల్ మన భూ ప్రపంచం మీద ఎక్కడైనా రావొచ్చు కదా? వాడ్ని ఎలా  పట్టుకుంటాము. అంటే మనం అంత త్వరగా వాడిని చేరుకోలేం కదా?”

“మేము ఎలా అయితే వాడి టైమ్ ట్రావెల్‌ను ట్రాక్ చేశామో అలానే ఇప్పుడు వాడి టెలిపోర్టల్‌ను కూడా ట్రాక్ చేశాము. వాడు అక్కడనుండి ఏ ఏ ప్రదేశాలకు వెళ్లే అవకాశం ఉందో మన టైం ఎనలైజర్ సహాయంతో కనిపెట్టవచ్చు” అని కీబోర్డు మీద టైప్ చేస్తూ, స్క్రీన్ చూపించి, “ఇదిగో ఈ ప్లేసులకు వాడు టెలిపోర్టు అయ్యే అవకాశం ఉంది. వాటిలో న్యూఢిల్లీ, వియాత్నం, లాజ్ ఏంజెల్స్, పారిస్ లాంటి నగరాలు ఉన్నాయి. ఇన్ని నగరాల్లో వాడు ఎక్కడ ఉన్నాడో మనం వెతకడం కష్టం. సో., ఆ పాడ్ సిగ్నల్ వచ్చే వరకూ మనం వెయిట్ చేయాలి. అప్పుడే వాడ్ని పట్టుకోగలం”

“అలా అయినా మనం ఇంత తక్కువ సమయంలో అంత దూరం ప్రయాణం చేయడమంటే మాటలు కాదు కదా..?”

“ముందసలు ఆ పాడ్ రానీ చూద్దాం” అంటూ తన కంప్యూటరును స్పేస్‌లో ఉన్న తన సొంత శాటిలైట్‌కు కనెక్ట్ చేసి, తన రిసీవర్స్ యొక్క కెపాసిటీని పెంచాడు  వశిష్ఠ.

ద్రోణా తనకున్న పరిజ్ఞానంతో వంశీ యొక్క కోడింగ్ అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. కానీ, అది తన బుర్రకు అందలేదు.

ఈలోగా వశిష్ఠ, వంశీకి కాల్ చేసి ల్యాబ్‌లో ఉన్న తన డివైజ్‌ను నేరుగా బెర్ముడాకు పంపమని అడిగాడు. దానికోసం జెట్‌ను పంపుతానని చెప్పాడు. తన సిస్టంలో చేస్తే అంత కరెక్ట్‌గా ప్రోసెస్ కాదని వశిష్ఠ అనుమానం. అందుకే నేరుగా వంశీ సిద్ధం చేసిన డివైజ్ లోనే దానిని ఎక్సిక్యూట్ చేయాలనుకున్నాడు.

ఈలోగా ద్రోణా, "ఆ ప్రోగ్రాంను ఇద్దరూ ఒకేసారి నువ్వు ఇక్కడనుండి వంశీ ఇండియా నుండి ఎక్జిక్యూట్ చేయండి. ఈ టైంలో రిస్క్ వద్దు. లొకేషన్ ఎవరి దగ్గర ముందొచ్చినా మనకు తెలుస్తుంది కాబట్టి సమస్యలేదు. పైగా ఇదంతా టైం వేస్ట్ పని.." అన్నాడు

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS